క్లుప్తంగా

అలరించిన భగవద్గీత శ్లోకాల పోటీలు



తునిలో భగవద్గీత శ్లోకాలు ఆలపిస్తున్న విద్యార్థిని

తుని: స్థానిక రోటరీ క్లబ్ భవనంలో విద్యార్థులకు నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీలు అలరించాయి. గురువారం సాయంత్రం రంగం యువనోత్సవాల్లో భాగంగా ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరిల్లో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా సుశీల, దామేశ్వరి, మహాలక్ష్మి వ్యవహరించారు. రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు మంగరాజు, కార్యదర్శి వీర్రాజు, కోశాధికారి కిశోర్‌రెడ్డి, డాక్టర్ నాగిరెడ్డి, గౌరీశంకర్ పాల్గొన్నారు.

ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా



ప్రత్తిపాడు చెరువులో బోల్తా పడిన ధాన్యంలోడు ట్రాక్టర్

ప్రత్తిపాడు: ధాన్యం లోడుతో వెళ్తున్న టాక్టర్ అదుపు తప్పి చెరువులో బోల్తా పడిన ఘటన గురువారం ప్రత్తిపాడులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన రైతు రోశయ్య ట్రాక్టర్‌పై ధాన్యం బస్తాలను తరలిస్తున్నారు. ప్రత్తిపాడు జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి ఊర చెరువులోకి దూసుకుపోయి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. రైతులే మరో వాహనంలో ధాన్యం బస్తాలను తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

మరో ఇద్దరికి జైలు

ప్రత్తిపాడు: స్థానిక సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, అన్నవరం, ఏలేశ్వరం మండలాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ ఏడుగురిని అరెస్టు చేసినట్టు స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. నిందితులను గురువారం స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి వారం రోజుల పాటు జైలు శిక్ష, మరో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున రూ.50 వేలు జరిమానా విధించినట్టు ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు వివరించారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కిర్లంపూడి: స్థానిక సాంబశివ హాస్పటల్‌లో శుక్రవారం కాకినాడకు చెందిన సిటీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆర్ఎంపీ వేగి సాంబశివ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ విభాగాల డాక్టర్లు వైద్య సేవలు అందిస్తారన్నారు. వీటితో పాటు బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిసినట్టు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవిశంకర్ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు క్విజ్ పోటీలు, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.సతీష్ కుమార్, చవాన్, భార్గవి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం



రాచపల్లిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి కేఎల్ఆర్ లెనోరా దంతవైద్యశాల ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్లు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. దంతాల సంరక్షణకు తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరించారు.

భారీ అన్నసమారాధన

కిర్లంపూడి: జగపతినగరంలో వేంచేసిన షిర్డీ సాయిబాబా మందిరం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలిత ఆలయ ప్రధాన అర్చకులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

రబీ రైతులపై బీమా పిడుగు !

- పంటల బీమా నుంచి తప్పుకున్న ప్రభుత్వం
- రైతులే చెల్లించాలని సూచన
- గడువు ముగుస్తున్నా ప్రీమియం చెల్లించని జీడి రైతులు
- 42 వేల ఎకరాల్లో రబీ సాగు



ఎస్.అన్నవరంలో సాగు చేస్తున్న మినుము పంట



వి.కొత్తూరులో ఆలస్యంగా సాగు చేస్తున్న వరి

తుని రూరల్: రబీలో వరి, మినుము, పెసర, జీడిమామిడి పంటల సాగు చేసే రైతులకు పంటల బీమా భారమవుతోంది. ఈ-క్రాప్ బుకింగ్ ఆధారంగా గడిచిన ఐదేళ్లు ప్రభుత్వమే ఇన్సురెన్స్ చేయించింది. దీంతో రైతులకు పంటల బీమాపై ధీమా ఉండేది. ఈ సంవత్సరం రబీ నుంచి వరి, పెసర, మినుముతో పాటు జీడిమామిడికి రైతులే పంటల బీమా చెల్లించాలని ప్రభుత్వం పేర్కొంది. దీంతో ఉద్యానశాఖ అధికారులు జీడిమామిడికి, వ్యవసాయ అధికారులు వరి, పెసర, మినుము పంటలకు బీమా చెల్లించడంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల 22లోగా జీడిమామిడికి ఎకరాకు రూ.1500 చొప్పున చెల్లించాలని రైతులకు అధికారులు వివరిస్తున్నారు. అలాగే రబీలో పెసర, మినుముకి రూ.300 చొప్పున డిసెంబరు 15 లోగా, వరికి రూ.630 చొప్పున డిసెంబరు 31 లోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. మెట్ట ప్రాంతం కావడంతో ఇప్పుడిప్పుడే ఖరీఫ్ కోతలు మొదలవుతున్నాయి. ఖరీఫ్ పూర్తయిన తర్వాతే రబీ సాగు మొదలవుతుంది. కోతలు పూర్తయ్యి రబీ ప్రారంభం నాటికి బీమా గడువు ముగిసిపోతుందని, వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

50 వేల మంది రైతులపై భారం

మెట్ట ప్రాంతమైన తుని వ్యవసాయ, ఉద్యాన సబ్‌డివిజన్‌లో 42 వేల ఎకరాల్లో 45 వేల మందికిపైగా రైతులు రబీ సాగు చేస్తున్నారు. మెట్టలో ఇంకా రబీ సాగు మొదలు కాలేదు. గతేడాది సాగు విస్తీర్ణాన్ని పరిగణంలోకి తీసుకుంటే 8964 ఎకరాల్లో వరి, 5781 ఎకరాల్లో పెసర, 6882 ఎకరాల్లో మినుము, 20,561 ఎకరాల్లో జీడిమామిడి సాగవుతుందని అంచనా. ఈ లెక్కన పంటల బీమా ప్రీమియంగా రైతులు రూ.4 కోట్లకుపైగా భారాన్ని మోయాల్సి వస్తుంది. బీమా భారమవ్వడంతో ఐదు మండలాల్లో ఇప్పటి వరకు 102 మంది రైతులే జీడిమామిడికి ప్రీమియం చెల్లించారు.

తుని సబ్‌డివిజన్‌లో గతేడాది రబీ సాగు వివరాలు

మండలం	వరి	పెసర	మినుము	జీడిమామిడి
తుని	497	1140	1013	3410
తొండంగి	7298	1450	637	1989
కోటనందూరు	78	2340	3412	3561
రౌతులపూడి	318	695	1507	7366
శంఖవరం	773	156	313	4235
మొత్తం	8964	5781	6882	20561

రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం



రబీలో సాగు చేసే వరి, పెసర, మినుము, జీడిమామిడికి పంటల బీమా రైతులు చెల్లించాల్సి ఉంది. దీనిపై రైతుల్లో అవగాహన కల్పిస్తూ చైతన్యం తీసుకువస్తున్నాం. పెసర, మినుము పంటలకు డిసెంబర్ 15, వరికి 31 వరకూ ప్రీమియం చెల్లింపునకు గడువు ఉంది. ఈ అవకాన్ని రబీ సాగుదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.అశోక్ కుమార్, ఏఓ, తుని

ముద్రగడను కలసిన నేతలు



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు గురువారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభంను కలిశారు. రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం సర్పంచ్ స్వర్ణం శ్రీను, అప్పన్నపాలెం సర్పంచ్ మిరియాల చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యులు కొల్లు తాతీలు, ఆవాల శ్రీను, గింజల అబ్బులు తదితరులు కిర్లంపూడిలోని ముద్రగడ పద్మనాభం నివాసంలో ఆయనను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముద్రగడతో తమకు ఉన్న జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మండల మాజీ ప్రెసిడెంట్ దివంగత కొల్లు కృష్ణారావుకు ఉన్న రాజకీయ పలుకుబడి, ఆయనతో తనకు ఉన్న అభిమానాన్ని ముద్రగడ వారితో పంచుకున్నారు. కార్యకర్తల సంక్షేమంపై ఆరా తీశారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

శంఖవరం: మండలంలోని కొత్తూరు, యూజేపురం గ్రామాల్లో గురువారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుడు అమ్ములు సాంబశివరావు ఆధ్వర్యంలో బాబాకు కాకడ హారతి, సుప్రభాత సేవ, సామూహిక సాయి వ్రతాలు, విరాట్ సాయి స్తోత్రం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక భక్తులు బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాఠశాలల్లో తనిఖీలు



ఒమ్మంగి హైస్కూల్‌లో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న సీఎంఓ నాగేశ్వరరావు

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని ప్రత్తిపాడు, ఒమ్మంగి, ధర్మవరం జిల్లా పరిషత్ పాఠశాలలు, ధర్మవరంలోని భవిత కేంద్రం, ఒమ్మంగిలో స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.రాజబాబు, ఎంఈఓ-2 అచ్చిరాజు, సీఆర్పీలు రాంజీ, గంగారావు, మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



కాకరాపల్లిలోని గ్రోమోర్ ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కోటనందూరు: నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని పెద్దాపురం ఏడీఏ, వ్యవసాయశాఖ ప్రత్యేక స్క్వాడ్ ప్రతినిధి ఎస్.దైవ కుమార్ హెచ్చరించారు. మండలంలోని కాకరాపల్లిలో గురువారం సాయంత్రం లక్ష్మీబాలాజీ, వెంకటేశ్వర, గ్రోమోర్ ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఏఓ చంద్రశేఖర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో రికార్డులు, నిల్వలను పరిశీలించారు. ప్రిన్సిపల్ సర్టిఫికెట్ (పీసీ)లేని కారణంగా రూ.3.2 లక్షల విలువైన పురుగు మందుల విక్రయాలను నిలిపేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పెద్దాపురం ఏడీఓ కార్యాలయ సిబ్బంది పీవీ శ్రీనివాస్, ఏఈఓలు కేవీ శివకుమారి, ఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు పెడితే సహించేది లేదు

- వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు



ఒమ్మంగిలో బులిరామకృష్ణను పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు, పార్టీ నేతలు

ప్రత్తిపాడు రూరల్: కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ నేత ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు. మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ (నాని)పై కూటమి నేతల ప్రోద్బలంతో ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు నమోదైంది. దీని పై స్పందించిన మురళీకృష్ణంరాజు ఒమ్మంగిలోని రామకృష్ణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నానిపై అక్రమంగా కేసు పెట్టి వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు. నాని కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దన్నారు. తప్పుడు కేసులు పెడితే సహించేది లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమంగా కేసులు పెట్టి వేధించడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీ ముప్పిటి ఏసుబాబు, అమరాధి కాశీ, మొల్లి వీరబాబు, ఉమ్మిడి తాతీలు, పిల్లా చిన్న, తటవర్తి రామన్నదొర, జువ్వల బాబులు, నానిపల్లి చంటి, దాడిశెట్టి చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన



తుని ఎస్‌బీఐలో డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్న సౌజన్య

తుని: చిరు వ్యాపారులు డిజిటల్ పేమెంట్స్ చేసే విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌బీఐ తుని మెయిన్ బ్రాంచి మేనేజరు సౌజన్య సూచించారు. స్థానిక బెల్లపువీధిలోని ఎస్‌బీఐలో స్వనిధి, డిజిటల్ చెల్లింపులపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఫోన్ పే, గగూల్ పే, పేటీఎం యాప్‌లతో ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ సేవల వలన కలిగే ప్రయోజనాలు, నష్టాలను వివరించారు. మెప్మా అధికారి శ్రీదేవి, సిబ్బంది, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

సత్య దీక్షలపై ప్రచారం



మల్లేపల్లిలో సత్య స్వాములతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న కృష్ణబాబు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో గురువారం సత్యదీక్షలపై ప్రచారం నిర్వహించారు. సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సత్యదీక్షలపై ప్రజలను చైతన్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శుక్రవారం అన్నవరంలో దేవస్థానం ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సత్యమాల ధరించిన స్వాములు పాల్గొనాలని కోరారు. సత్య సాములు దార్లంక శ్రీనివాసరావు, అర్జీ భాస్కర్ వెంకట్ కిరణ్, తెమ్మనబోయిన జయరాజు, పోతుల సత్తిబాబు, వలవు సూరిపండు, పత్తిగళ్ల దుర్గాప్రసాద్, బుడంకాయల పేర్రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత సతీష్‌కు పరామర్శ



అన్నవరంలో సతీష్‌ను పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

అన్నవరం: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తాటిపాక సతీష్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. కాగా ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు ముదునూరు మురళీ కృష్ణంరాజు గురువారం సతీష్‌ను పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యసహాయం నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ శ్రేణులకు ఏ కష్టం వచ్చినా తనను సంప్రదించాలన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎంపీటీసీ దడాల సతీష్, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, తాటిపాక కృష్ణ, పలివెల కొండలరావు, గంపల సత్తిబాబు, నక్క బాజీ తదితరులు పాల్గొన్నారు.

నిత్య హరినామ సంకీర్తనకు అవకాశం కల్పించాలి



రత్నగిరిపై సమావేశమైన భజన బృందాలు

అన్నవరం: కాకినాడ జిల్లాలోని వేయి మంది భజన బృందాల సభ్యులకు రత్నగిరిపై నిత్యం హరినామ సంకీర్తన చేసే అవకాశం కల్పించాలని కాకినాడ జిల్లా భజన కళాకారుల సంఘం కోరింది. రత్నగిరి కళావేదిక మీద గురువారం భజన బృందాలు సమావేశమై భజనలు చేశారు. ఈ సందర్భంగా తమను ఎవరూ పట్టించుకోలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందచేశారు. భజన బృందాలకు పారితోషకం అందజేయాలని, భజన గురువులకు నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. భజన కళాకారుల సంఘం అధ్యక్షుడు స్వామి నిర్భయానంద, కన్వీనర్ సాన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న రజక చైతన్య సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సీతారాముడు

గోకవరం: రజకులు ఐక్యతతో మెలిగి సమస్యలు పరిష్కరించుకోవాలని రజక చైతన్య సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మాతా సీతారాముడు అన్నారు. మండల రజక సంఘం సమావేశం గురువారం గోకవరంలో జరిగింది. సంఘ మండల ప్రధాన కార్యదర్శి భీమవరపు వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీతారాముడు, నియోకవర్గ ప్రధాన కార్యదర్శి గంటి వెంకటేశులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారాముడు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రజక చెరువులపై రజకులకు పూర్తి హక్కు ఉంటుందన్నారు. ప్రభుత్వం రజకులకు కల్పించే ప్రతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు కోనేటి నాగరాజు, మండలాధ్యక్షుడు తాడి కృపారావు, టౌన్ ప్రెసిడెంట్ భీమవరపు రాఘవ, టేకు వీరబాబు, తెల్ల ప్రకాష్, మాదేటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి తీవ్ర గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై ఆదికవి నన్నయ యూనివర్సిటీ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన గార సన్నీ.. నన్నయ క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి రహదారిపై నడిచి వెళుతున్న అతడిని పచ్చగడ్డి మోపులతో వెళుతున్న బైకు తగులుకోవడంతో కింద పడిపోయాడు. అదే సమయంలో కాకినాడ నుంచి తెలంగాణాకు వెళుతున్న లారీ అతడి ఎడమ కాలు ఎక్కేసింది. ఈ ప్రమాదంలో సన్నీ కాలు నుజ్జునుజ్జయ్యింది. అతడిని 108లో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఫార్మసీ విద్యార్థుల ర్యాలీ

గోకవరం: జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా కొత్తపల్లి ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు గురువారం గోకవరంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ త్రినాథరావు మాట్లాడుతూ ఫార్మసిస్ట్ ఆవశ్యకతను తెలియజేసేందుకు సుమారు 300 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించామని తెలిపారు.

మృతుల కుటుంబాలకు యనమల కృష్ణుడి పరామర్శ

తొండంగి: మండలంలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు గురువారం పరామర్శించారు. మండలంలోని అవర్దారుపాడులో యాదాల ఉప్మాకమ్మ, కొత్తపోడిపల్లి పేటలో పెరుమాళ్ల కాశీ, తలపంటిపేటలో యనమల అప్పయ్యమ్మ, శ్రీరామపురంలో కడారి బాబూరావు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను యనమల కృష్ణుడు పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో తుని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ, దేవారపు సూర్యచక్రం, ఎంపీపీ విజయబాబు, బద్ది నూకరాజు, గంటా చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ఆరుగురి అరెస్టు

రౌతులపూడి: గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ వెంకటేశ్వరరావు గురువారం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3200 నగదు, రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సైబర్ నేరాల్లో చిక్కుకోవద్దు

- డీఎస్పీ శ్రీహరి రాజు
- పలు కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన

గండేపల్లి: విద్యార్థులు సైబర్ నేరాల్లో చిక్కుకోవద్దని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరి రాజు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల్లో చిక్కుకునే వారిలో విద్యావంతులు, విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారని అన్నారు. వీడియో, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సైబర్ నేరాలు, నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై యువి శివనాగబాబు, కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, అకడమిక్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తుని: ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తుని పట్టణ సీఐ గీతారామకృష్ణ విద్యార్థులకు సూచించారు. గురువారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాల నుంచి ఎలా బయటపడాలో పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. డిజిటల్ అరెస్ట్, కేవైసీ, స్టాక్ మార్కెట్ మోసం తదితర అంశాలను తెలియపరచారు. ఎస్సై విజయ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటనందూరు: ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై టి.రామకృష్ణ సూచించారు. స్థానికంగా ఓ ప్రైవేటు కాలేజీలో విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కొంతమంది సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అసలు డిజిటల్ అరెస్టు అనేది చట్టంలోలేనే లేదన్నారు. ఇటువంటి వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్ ఓటీపీ, ఫేక్ ఇన్వెస్టుమెంట్ యాప్, ఆన్‌లైన్ లోన్ యాప్‌లపై అవగాహన కల్పించారు. ఈ విషయాలపై ప్రజలను చైతన్య పరచాలని విద్యార్థులకు సూచించారు. పలువురు ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

జగ్గంపేట: సైబర్ నేరాలపై జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గురువారం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. జగ్గంపేట ఎస్సై రఘునాథరావు ఆధ్వర్యంలో ప్రయాణికులకు వీడియో క్లిప్పింగ్స్ ద్వారా అవగాహన కల్పించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరి రాజు

గోకవరం: సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం గోకవరం ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని వివిధ కళాశాలల విద్యార్థులు, వివిధ బ్యాంకుల సిబ్బందితో కలిసి గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి దేవీచౌక్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా కోరుకొండ సీఐ సత్యకిశోర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయన్నారు. స్మార్ట్ ఫోన్ల వినియోగంపై అవగాహన లేకపోవడం, సోషల్ మీడియాలో వచ్చిన లింకులను క్లిక్ చేయడం, అజ్ఞాత వ్యక్తులకు ఓటీపీ, వ్యక్తిగత సమాచారం అందించడం వలన సైబర్ నేరాల బారిన పడుతున్నారన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

శంఖవరం: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నవరం ఎస్సై హరిబాబు సూచించారు. మండలంలోని కత్తిపూడిలో సీతారామ డిగ్రీ కళాశాలలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తునిలో అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు



కోటనందూరులో సైబర్ నేరాలపై వీడియో రూపంలో అవగాహన



గోకవరంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న సీఐ సత్యకిశోర్, ఎస్సై పవన్‌కుమార్

పోక్సో కేసు నమోదు

ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ఓ బాలిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఆమెకు బంధువైన మోర్త కిషోర్ మాయ మాటలు చెప్పి, సోమవారం రాత్రి తీసుకుపోయాడు. దీనిపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశారు. అయితే వారిద్దరిని ప్రత్తిపాడు గ్రామ శివారులో ప్రగతి స్కూల్ సమీపంలో బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. గురువారం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడు మోర్త కిశోర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం తెలిపారు. ఈ కేసును పెద్దాపురం డీఎస్పీ దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రత్తిపాడు: తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లాలో నడిరోడ్డుపై లాయర్ కన్నన్‌ను హత్య చేయడాన్ని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ఖండించింది. ఈ మేరకు గురువారం ప్రత్తిపాడులో ఐలాజ్ రాష్ట్ర హడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ మాట్లాడుతూ ఈ నేరానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడులను అరికట్టేందుకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ రూపొందించాలని కోరారు. డిసెంబర్‌లో జరిగే ఐలాజ్ రాష్ట్ర, జాతీయ మహాసభల్లో ఈచట్టంపై చర్చిస్తామని తెలిపారు.